సాక్షి

పార్వతీపురం మన్యం

ఆదివారం । 25 । మే । 2025



సాగుకు ముందస్తు సన్నద్ధత!

ఖరీఫ్‌కు రైతులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలోనే విత్తు పడితే సిరుల పంట పండుతుందని రైతుల నమ్మకం. - 8లో



రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన - 8లో

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ విక్రాంత్ ధ్వజమెత్తారు.



రైల్వేస్టేషన్‌లో మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ - 8లో

మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి కొత్తవలస రైల్వేస్టేషన్‌లో హచ్‌చల్ చేశాడు.

న్యూస్‌రీల్

కార్పొరేషన్ రుణాలకు బ్రేక్

● దరఖాస్తు దారుల్లో ఆందోళన

పార్వతీపురం టౌన్: వివిధ కార్పొరేషన్ల కింద రుణాలు మంజూరు చేస్తాం.. యువత స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నామంటూ హడావిడి చేసిన కూటమి ప్రభుత్వం మాట మార్చింది. రుణాల మంజూరుకు బ్రేక్ వేసింది. దీంతో దరఖాస్తు చేసుకుని, రుణాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు సామాజిక వర్గాల లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. జిల్లాలో 266 బీసీ, 266 ఎస్సీ యూనిట్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. బీసీ లబ్ధిదారులకు రూ.35 కోట్లు, ఎస్సీ లబ్ధిదారులకు రూ. 11.53కోట్లు విడుదల చేస్తామని మహాత్మాజ్యోతిబాపూలే జయంతి సాక్షిగా మంత్రి సంధ్యారాణి ఆర్భాటంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన నమూనా చెక్కును విడుదలచేశారు. అయితే, రుణాల మంజూరుకు తాజాగా బ్రేక్ వేశారు. ఎంపిక జాబితాలను నిలిపివేయాలని, దీనిపై తదుపరి నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వ ప్రకటనతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నార

ఆర్‌ఎస్‌ఎస్ నేతలే టార్గెట్..!



సిరాజ్, సమీర్‌లను విచారణ చేసేందుకు విజయనగరం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు వస్తున్న అధికారులు

విజయనగరం క్రైమ్: బాంబు పేలుళ్ల కుట్ర కేసులో అరెస్టై.. పోలీస్ కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌లను విచారణ జరుపుతున్న ఎన్‌ఐఏ అధికారులు, స్థానిక పోలీసులకు విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు, ఆలయాలను దర్శించుకునే భక్తులే టార్గెట్‌గా పేలుళ్లు జరపాలని నిర్ణయించినట్టు భోగట్టా. విజయనగరం జిల్లాలో అధికమంది భక్తుల ప్రాణాలు తీసేలా ఐదుచోట్ల బాంబులు పేల్చేందుకు ఇమ్రాన్, బలుజిస్తాన్ అనే వ్యక్తులతో కలిసి పథక రచన చేసినట్టు సిరాజ్ తెలిపినట్టు సమాచారం. దీనికోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ క్రియేట్‌చేసి చాటింగ్ చేసినట్టు తెలిసింది. అవసరమైతే మానవబాంబుగా మారేందుకు కూడా సిద్ధపడినట్టు విచారణలో సిరాజ్ వెల్లడించినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ ఆధారాల ఆధారంగా యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించింది. విజయనగరం పీటీసీలో రెండోరోజు సిరాజ్, సమీర్‌లను ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌ఐఏ బృందం విచారణ జరిపింది. తొలుత వీరిద్దరూ నోరుమెదిపేందుకు ఇష్టపడకపోవడంతో వేర్వేరుగా విచారణ జరిపారు. విజయనగరం ఆబాద్‌వీధికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌ల మధ్య కుదిరిన స్నేహం, ఇద్దరు సౌదీ, అక్కడ నుంచి ఉమెన్ దేశానికి ఎలా వెళ్లారు అన్న కోణంలో దర్యాప్తు సాగించినట్టు తెలుస్తోంది. సిరాజ్ కాల్ డేటా ఆధారంగా లోతుగా విచారణ జరుపుతున్నారు.

బీఏలో బిజిలీ ఫస్ట్

బొబ్బిలి: ఆంధ్రా యూనివర్సిటీ 2024–25 సంవత్సరంలో నిర్వహించిన బీఏ ఫైనల్ ఇయర్ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో బొబ్బిలికి చెందిన యడ్ల బిజిలీ 9.04 పాయింట్లతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినిని బొబ్బిలివాసులతో పాటు కళాశాల సిబ్బంది అభినందించారు.

తప్పిన ముప్పు



పొగలు రావడంతో కోమటిపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆగిన ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్

దత్తిరాజేరు: వైజాగ్ నుంచి బీహార్ రాష్ట్రం ధన్‌బాద్ వెళ్తున్న ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం పెదమానాపురం రైల్వే గేట్ వద్దకు వచ్చే సరికి చక్రాల నుంచి పొగలు వచ్చాయి. గేట్‌మన్ గమనించి కోమటిపల్లి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. రైలును అక్కడ కాసేపు నిలిపారు. రైలులో వస్తున్న పొగలు చూసి ప్రయాణికులు కంగారుపడ్డారు. స్వల్ప సాంకేతిక లోపంతో రైలు చక్రాలు వేడెక్కడంతో పొగలు వచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. రైలును కాసేపు నిలిపిన తర్వాత కదలడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

● ప్రజాప్రతినిధిగా ఇదేనా సంస్కారం
● ఎమ్మెల్యే విజయ చంద్ర వ్యాఖ్యలు బాధించాయి..
● కమిషనర్ తీరు ఆక్షేపణీయం
● ఆవేదన వ్యక్తం చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ గౌరీశ్వరి, వైఎస్సార్ సీపీ మహిళా కౌన్సిలర్లు
● ఎస్పీకి ఫిర్యాదు



పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, కమిషనర్ వెంకటేశ్వరులపై ఎస్పీ మాధవ్‌రెడ్డికి ఫిర్యాదుచేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

మహిళలను తిట్టడమేనా.. గౌరవం?

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్:

మొన్న ఒక మండల మేజిస్ట్రేట్, మహిళా తహసీల్దార్‌పై అసభ్య పదజాలంతో బెదిరింపు, మీడియా సమావేశంలోనూ రాయలేని మాటలతో ఆ అధికారిణిపై దుర్భాషలు... నిన్న పార్వతీపురం పట్టణ ప్రథమ పౌరురాలు పట్ల అనుచిత వ్యాఖ్యలు.. మరి రేపు? పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వ్యవహార శైలితో బాధితులుగా మారుతున్న మహిళల ఆవేదన ఇది. ఇప్పటికే ఇద్దరు అబలలు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల కిందట పార్వతీపురం మండల తహసీల్దార్ పోలీసులకు రాసినట్టు ఒక ఫిర్యాదు లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఇప్పుడు మరో బీసీ మహిళ.. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు. మహిళలు అంటే తనకు ఎంతో గౌరవమని తానుగా ప్రకటించుకున్న ఎమ్మెల్యే... వారిని అగౌరవ పరచడమే గౌరవించడమా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై ఏకంగా నలుగురు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇంత అన్యాయం జరుగుతున్నా కూటమి ప్రభుత్వం, టీడీపీ అధిష్టానం కూడా స్పందించకపోవడంపై వారంతా ఆవేదన చెందుతున్నారు. ఇది మహిళాలోకానికి అవమానకరమని చెబుతున్నారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన చైర్‌పర్సన్

ఈ నెల 23న జరిగిన పార్వతీపురం పురపాలక సంఘ బడ్జెట్, సాధారణ సమావేశంలో పట్టణ ప్రథమ పౌరురాలైన తనపై పోలీసుల సమక్షంలోనే కొంత మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అసభ్య పదజాలంతో దూషణకు దిగారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని.. తమ సభ్యులపై టీడీపీ వారు దౌర్జన్యానికి దిగినా నవ్వుతూ ఉండిపోయారని జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. కూటమి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచనలతోనే ఇదంతా జరిగిందన్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగితే.. ఒక్క వైఎస్సార్‌సీపీ సభ్యులనే పోలీసులు బలవంతంగా నెట్టుకుంటూ బయటకు పంపేశారని తెలిపారు. ఎమ్మెల్యే సైగలు చేయడంతోనే తమ పార్టీ కౌన్సిలర్లు రణభేరి బంగారు నాయుడు, నిమ్మకాయల సుధీర్లను బయటకు నెట్టేశారని వివరించారు. కనీసం మహిళ అని చూడకుండా తనపై ఎమ్మెల్యే విజయచంద్ర అనుచిత వ్యాఖ్యలు చేశారని.. తనను సైకోగా మీడియా ఎదుటే కించపరిచారని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయన్నారు.

మున్సిపల్ కమిషనర్ తీరుపైనా ఫిర్యాదు

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తీరుపైనా ఆమె ఫిర్యాదు చేశారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఇంటికి సిబ్బందిని సంతకాల కోసం పంపిస్తున్నారని.. ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఒక మహిళ పట్ల ఇలాగేనా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు. మున్సిపల్ మహిళా ఉద్యోగులు సైతం ఆయన తీరుతో తీవ్ర మనోవేదనకు, భయభ్రాంతులకు గురవుతున్నట్లు వివరించారు. న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

సజావుగా ఇంటర్మీడియట్ ప్రవేశాల కౌన్సెలింగ్

సీతంపేట:

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు శనివారం సీతంపేట బాలుర గురుకుల కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్ సజావుగా సాగింది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సీటు కేటాయిస్తూ ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ప్రవేశపత్రం అందజేశారు. బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున భర్తీ చేశారు. వృత్తివిద్యాకోర్సు అయిన ఎఅండ్‌టీ (అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్)లో 20 సీట్లలో విద్యార్థినులను జాయిన్ చేసుకున్నారు. 507 మంది బాలికలు దరఖాస్తు చేసుకోగా 450 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. బాలుర కళాశాలలో ఎంపీసీలో 40కి గాను 36 సీట్లు భర్తీ అయ్యాయి. బైపీసీలో 40కి 38, హెచ్‌ఈసీలో 38 సీట్లలో విద్యార్థులు ప్రవేశాలు పొందారు. సీజీఏ 30కి 30, ఏఅండ్‌టీ 20కి 20 సీట్లు భర్తీ చేశారు. మొత్తం 170కి గాను 162 భర్తీ అయ్యాయి. 263 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 200ల మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటరమణ, ప్రిన్సిపాళ్లు కృష్ణమోహన్, పి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రవేశపత్రం అందజేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

అక్రమంగా తరలిస్తున్న సిగరెట్లు స్వాధీనం



వ్యాన్‌లో ఉన్న సిగరెట్ బాక్సులు

రామభద్రపురం: నకిలీ ఇన్వాయిస్‌లతో అక్రమంగా తరలిస్తున్న సిగరెట్లు, గిన్నెలు తోమే సబ్బులను విజయనగరం జిల్లా రామభద్రపురం వద్ద వాణిజ్యపన్నుల శాఖ స్వాధీనం చేసుకుంది. గుంటూరు ఎంబీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట నకిలీ ఇన్వాయిస్ సృష్టించి బీహార్ నుంచి సరుకు రవాణా అవుతున్నట్టు విచారణలో తేలిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చీఫ్ టాక్స్ కమిషనర్ ఎ.బాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.96 లక్షల విలువైన సిగరెట్లు, రూ.2.53 లక్షల డిష్‌వాష్‌లను సీజ్ చేశామన్నారు.

పశువైద్యుల కొరత



తాళ్లబురిడిలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల



సంరక్షణ లేని కారణంగా రహదారిపై వ్యర్థాలను తింటున్న ఆవులు

● జిల్లా వ్యాప్తంగా 20 మంది వైద్యులు, 22 మంది సిబ్బంది పోస్టులు ఖాళీ
● సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న మూగ జీవులకు అందని మెరుగైన వైద్యం
● ఆందోళన చెందుతున్న పాడి రైతులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో పశువైద్యులు, సిబ్బంది కొరత పాడి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మూగజీవాలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందడంలేదు. గత ప్రభుత్వం పాడి రైతులకు మేలుచేసేలా అందుబాటులోకి తెచ్చిన సంచార పశువైద్య సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. అప్పటినుంచి మూగజీవాల వైద్యానికి రైతులు, పెంపకందారులకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు శిథిలావస్థకు చేరిన భవనాల్లో వైద్యశాలల నిర్వహణ కష్టతరమవుతోంది. పలు చోట్ల ఇన్‌చార్జి వైద్యాధికారులే కావడంతో వారానికి ఒకసారి వచ్చి సేవలందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 38 పశువైద్యశాలలు ఉండగా 20 మంది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, వెటర్నరీ అసిస్టెంట్, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్, కంపౌండర్ తదితర సిబ్బంది ఖాళీలు 22 ఉన్నాయి. దీంతో సిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు యాతన పడుతున్నారు. కొన్నిసార్లు వీలుకావడంలేదని సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామీణ పశువైద్య కేంద్రాలకు, సబ్‌సెంటర్లకు నూతన భవనాలు నిర్మాణాల కోసం నిధులు కేటాయించాలని, సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది కొరత విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. శిథిలావస్థకు చేరిన చోట్ల నూతన వైద్యశాలల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. అవసరమైన చోట పశువైద్య శిబిరాలు నిర్వహించే సేవలందిస్తున్నాం.

– ఎస్.మన్మథరావు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

చంపావతిపై చిన్నచూపు

గజపతినగరం రూరల్: ఆంధ్ర కొండల నడుమ పుట్టిన చంపావతి నది జిల్లాలో 64 కిలోమీటర్ల మేర ప్రవహించి పూసపాటిరేగ మండలం కోనాడ వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. వేలాది ఎకరాలకు సాగునీరు, తీర గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చుతోంది. వర్షాకాలంలో నాడు గోదావరిలా కనిపించే నది నేడు పిచ్చిమొక్కలు, ఆక్రమణల చెరలో చిక్కుకుంది. కొన్నిచోట్ల నది అడవిని తలపిస్తోంది. ఇసుక అక్రమ తవ్వకాలతో రూపుకోల్పోయింది. నది పరిరక్షణపై కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం రైతులు, తీర గ్రామాల ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది.



పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న చంపావతి నది

‘తోటపల్లి’ సాక్షిగా...

దొంగ బిల్లుల బాగోతం

అసలు పని చేయనేలేదు.. రూ.23.54 లక్షలకు బిల్లు పెట్టేశారు. ఆ పనులు నాణ్యతతో చేసినట్టు క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా ధ్రువీకరించేశారు. కింది నుంచి పై స్థాయి వరకు ప్రజాధనం దోచుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఇది కాస్త బహిర్గతమయ్యేసరికి తడుముకుంటున్నారు. తోటపల్లి కాలువల సాక్షిగా జలవనరుల శాఖలో సాగుతున్న అవినీతి తంతుపై రైతాంగం గుర్రుమంటోంది.

● పనులు చేయకుండానే బిల్లుల నమోదు
● రూ.23.54 లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిధులు కాజేసేందుకు స్కెచ్!
● చేయని పనులకు నాణ్యతతో చేసినట్టు ధ్రువీకరించిన క్వాలిటీకంట్రోల్ అధికారులు
● కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పనులు జరిగినట్టు సంతకాలు
● ఒకటిరెండు రోజుల్లో బిల్లులు మంజూరయ్యే అవకాశం
● వెలుగుచూసిన జలవనరుశాఖలో అవినీతి పర్వం

వీరఘట్టం: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కాలువల ఆధునికీకరణ పనులు నిలిచిపోయాయి. రానున్న ఖరీఫ్‌కు సాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు వీలుగా పాత ఆయకట్టు కాలువలను బాగుచేసేందుకు రాష్ట్ర విపత్తు ఉపశమననిధి (ఎస్‌డీఎంఎఫ్) కింద రూ.30.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, పూడికలు తొలగించాలి. జలవనరులశాఖలో ఉన్న కొందరు అధికారులు ఎడమ కాలువలో గుర్తించిన 8 పనుల్లో ఏడు పనులు చేయకుండానే పనులు చేసినట్లు బిల్లులు సృష్టించారు. ఈ పనులకు సంబంధించిన ఫైల్‌ను క్వాలిటీ అధికారులకు నివేదించారు. వారు కనీసం పనులు జరిగాయా లేదా అని పరిశీలన చేయకుండా పనులు నాణ్యతా ప్రమాణాలతో చేసినట్లు నిర్ధారిస్తూ క్వాలిటీ నివేదిక సైతం ఇచ్చేశారు. ఇలా కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు జరగని పనులకు జరిగినట్లుగా బిల్లులు సిద్ధం చేసి రూ.23.54 లక్షలు కాజేసేందుకు ఎత్తుగడ వేశారు. ప్రస్తుతం ఈ బిల్లుల ఫైల్ రాష్ట్ర జలవనరులశాఖ కార్యాలయంలో మంజూరుకు సిద్ధంగా ఉంది. మరో రెండు రోజుల్లో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇంతలో ఈ దొంగ బిల్లుల వ్యవహారం వెలుగు చూడడంతో రైతన్నలు విస్మయం చెందుతున్నారు. ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు ఆరంభమయ్యాయి. కాలువల్లో నీరు చేరింది.. ఇదే అదునుగా పనులు చేయకుండానే చేసినట్టు చూపించి బిల్లులు కాజేసేందుకు అధికారులు స్కెచ్ వేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆందోళనలో రైతన్నలు...

ఓ పక్క తోటపల్లి ఆధునికీకరణ పనులు ఆగిపోయాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు వస్తుందా, రాదా అనే ఆందోళనలో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ తరుణంలో కాలువలో పూడికలు తొలగించి సకాలంలో సాగునీరు అందించాల్సిన జలవనరులశాఖ అధికారులు ఇటువంటి పనులు చేపట్టడం అన్యాయమని రైతులు మండిపడుతున్నారు. ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తమకేమీ తెలీదంటున్న క్వాలిటీ అధికారులు...

ఎడమకాలువలో ఎస్‌డీఎంఎఫ్ నిధులతో చేపట్టాల్సిన పనులు చేయకుండానే వాటికి క్వాలిటీ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వద్ద ‘సాక్షి’ ప్రస్తావించగా మా వద్ద కు ఎన్నో వర్కులు వస్తుంటాయని, అందులో మీరు అడిగిన వర్కులు వచ్చాయో లేదో అని దాటవేస్తూ సమాధానం ఇచ్చారు.

● తురకనాయుడువలస నుంచి 1వ బ్రాంచ్ కాలువలో రెండు చోట్ల రూ.3.80 లక్షలతో రెండు పనులు, తోటపల్లి ఎడమ ప్రధాన కాలువలో రూ.4 లక్షలతో, మరో చోట మరో రూ.4.74 లక్షలతో, ఎడమకాలువ పరిధిలో ఉన్న చలివేంద్రి బ్రాంచ్ కాలువలో మట్టి తీయించేందుకు రూ.1.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ వర్కులన్నీ పూర్తి చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తప్పుడు బిల్లులు సృష్టించారు. ఎడమ కాలువ పరిధిలోని మొత్తం ఏడు పనులను రూ.23.54 లక్షలో చేపట్టినట్లు బిల్లులు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జలవనరులశాఖ డివిజనల్ కార్యాలయంలో ఈ పనులకు సంబంధించిన ఎమ్ బుక్‌లు, క్వాలిటీ సర్టిఫికెట్లు పేమెంట్ కోసం సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.



రూ.1.90 లక్షలతో పనులు చేపట్టినట్లు అధికారులు చెబుతున్న తోటపల్లి కాలువ ఇది



1వ బ్రాంచ్‌లో రూ.1.90 లక్షలతో పనులు చేపట్టినట్లు ఎంబుక్ రికార్డు చేసిన కాలువ ఇది

రెండు రోజుల్లో పనులు చేపడతాం

ఎడమకాలువలో ఎస్‌డీఎంఎఫ్ నిధులతో చేపట్టాల్సిన పనుల కాల పరమితి మార్చితో పూర్తయింది. అందుకే ఆ నిధులు వెనుకకు వెళ్లిపోతాయని ముందుగా బిల్లులు సిద్ధంచేశాం. అంతే తప్ప ఇందులో ఎటువంటి దురుద్దేశం లేదు. రెండు రోజుల్లో కాలువలో పనులు చేపడతాం.

– డి.వి.రమణ, ఏఈ, జలవనరులశాఖ, వీరఘట్టం

పనులు చేపట్టకుండా బిల్లులు పెట్టకూడదు

ఏ పనులైనా చేపట్టకుండా బిల్లులు పెట్టకూడదు. తోటపల్లి కాలువలో ఎస్‌డీఎంఎఫ్ నిధులతో మంజూరైన పనుల బిల్లులు ఇంకా రాలేదు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం. అవసరమైతే ఫీల్డ్‌కు వెళ్లి తనిఖీలు చేస్తాను.

– పి.సుధాకరరావు, ఈఈ, జలవనరులశాఖ, శ్రీకాకుళం

ఇది తోటపల్లి ఎడమకాలువలోని 1వ బ్రాంచ్‌లోని కెల్ల చానల్. ఈ కాలువలో మట్టి పనులు చేసేందుకు రూ.5 లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిధులు మంజూరు చేశారు. అయితే జలవనరులశాఖ అధికారులు మాత్రం ఈ కాలువలో ఎలాంటి పనులు చేయలేదు. ఒక్క పిచ్చిమొక్కకూడా తొలగించలేదు. కానీ, రూ.5 లక్షలు వెచ్చించి పనులు చేసినట్టు ఎమ్ బుక్‌లో రికార్డు చేసేశారు. ఇక్కడ చేపట్టిన పనులు ఎంతో నాణ్యతతో ఉన్నట్లు క్వాలిటీ అధికారులు ధ్రువీకరించి క్వాలిటీ సర్టిఫికెట్ కూడా ఇచ్చేయడం గమనార్హం.



ఇది తోటపల్లి ఎడమకాలువలోని 2వ బ్రాంచ్ కాలువ. ఈ కాలువలో మట్టి పనులు చేసేందుకు రూ.4.50 లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ కూడా పనులు చేపట్టినట్లు అధికారులు తప్పుడు పత్రాలు సిద్ధం చేశారు.



క్లుప్తంగా

ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిగా జగన్మోహనరావు



డాక్టర్ జగన్మోహనరావుకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం టౌన్: ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ టి.జగన్మోహనరావును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులను డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు అందజేశారు. కమిషనర్, ఆరోగ్య - కుటుంబ సంక్షేమ శాఖ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం నుంచి పొరుగు సేవల ప్రాతిపదికన డాక్టర్ జగన్మోహనరావును ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయని డీఎంహెచ్‌వో తెలిపారు. గతంలో డీఐవో, డీఎంవో, ఇంచార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, పలు ఆరోగ్య కార్యక్రమాలకు ప్రోగ్రాం అధికారిగా జగన్మోహనరావు జిల్లాలో పని చేశారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, వ్యక్తులతో ఎస్‌ఐ సుదర్శన్, తహసీల్దార్ రాములమ్మ, సిబ్బంది

వేపాడ: మండలంలోని పాటూరు జంక్షన్ సమీపంలో కారులో రవాణా చేస్తున్న రెండు కేజీల గంజాయి పట్టుకున్నట్టు వల్లంపూడి ఎస్‌ఐ ఎస్.సుదర్శన్ తెలిపారు. శనివారం ఎస్.కోట - కొత్తవలస ప్రధాన రహదారిలో పాటూరు వద్ద ఎస్‌ఐతో పాటు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు నుంచి విశాఖ వైపు వెళ్తున్న మారుతీ సుజుకి తెలంగాణకు చెందిన కారులో ఇద్దరు వ్యక్తులు గంజాయితో పట్టుబడినట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయితోపాటు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. తనిఖీల్లో తహసీల్దార్ జె.రాములమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

భామిని: మండలంలోని కోసలికి చెందిన కరణం తిరుపతిరావును పోక్సో చట్టం కింద శనివారం అరెస్టు చేసి కొత్తూరు కోర్టులో హాజరు పరిచినట్టు బత్తిలి ఎస్‌ఐ జి.అప్పారావు తెలిపారు. ఈ నెల 22న కోసలికి చెందిన పదేళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఉడుమును పట్టుకున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం గంటస్తంభం: జొన్నాడ జంక్షన్ వద్ద ఈ నెల 19వ తేదీన గణేష్‌నగర్‌కు చెందిన వనము తాతా అనే వ్యక్తి ఉడుమును పట్టుకుని సంచరిస్తుండగా డీఎఫ్‌వో బి.శ్రీనివాసరావు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం ఉడుమును చంపడం నేరమని, వన్యప్రాణులను చంపినా, వాటిని కొనుగోలు చేసినా చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఉడుమును పట్టుకున్న వనము తాతాపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: సాలూరు ఆర్టీసీ డిపోలో రోజు వారి వేతనంపై తాత్కాలికంగా డ్రైవర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు 18 నెలలు గడువు నిండి ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు డిపోలో అధికారులను సంప్రదించాలని సూచించారు.

అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

కొత్తవలస : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి చెందిన జోడు అప్పన్న(32)కు రిమాండ్ విధించినట్టు సీఐ షణ్ముఖరావు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నిందితుడు బాలికపై ఈ నెల 21వ తేదీన అత్యాచార యత్నానికి పాల్పడినట్టు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. శనివారం నిందితుడిని తుమ్మికాపల్లి జంక్షన్ సమీపంలో మాటు కాసి పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కొత్తవలస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో ఎస్.కోట సబ్ జైలుకు తరలించినట్టు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

సాగుకు ముందస్తు సన్నద్ధం!



బూసాయవలసలో మొక్కజొన్న సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

- కల్తీ విత్తనాలతో తస్మాత్..
- ప్రభుత్వ లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



కూరగాయ పంటల సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

రామభద్రపురం: ఖరీఫ్‌కు రైతులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలోనే విత్తు పడితే సిరుల పంట పండుతుందని రైతుల నమ్మకం. జిల్లాలో ప్రధానంగా వరి 91,214 హెక్టార్లు, మొక్కజొన్న 12,386 హెక్టార్లు, పత్తి 2142 హెక్టార్లు, చెరకు 4,720 హెక్టార్లు, వేరుశనగ 369 హెక్టార్లు, వివిధ రకాల కూరగాయలు 350 హెక్టార్లలో సాగు చేయనున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కొద్దిపాటి అకాల వర్షాలు పడడం వల్ల రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. పొలాలకు ఎరువులు తీసుకువెళ్లడం, దుక్కులు దున్నడం లాంటి పనులు చేస్తున్నారు. ఎప్పుడైతే వర్షాలు సమృద్ధిగా పడతాయో ఆ క్షణమే పొలంలో విత్తనాలు విత్తేందుకు వీలుగా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే విత్తనాలు తీసుకొని, ఇక్కడ అందుబాటులో లేని విత్తనాలను రైతులు ప్రైవేటు దుకాణాలపై ఆధారపడుతున్నారు. తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ కొందరు వ్యాపారులు రైతులను మభ్య పెడుతున్నారు. కల్తీ విత్తనాల బారిన పడి రైతులు ప్రతీ ఏడాది నష్టపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కల్తీ విత్తనాలను ముందే గుర్తించకపోతే నష్టపోక తప్పదని వ్యవసాయ శాఖాధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే నష్టం జరిగినా ఆ తర్వాత సంబంధిత కంపెనీల నుంచి పరిహారం పొందవచ్చు.

రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు

రైతు భరోసా కేంద్రాల్లో లభించని విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. కొన్నిచోట్ల ప్రభుత్వం అనుమతి లేకపోయినప్పటికీ అనధికారంగా కల్తీ విత్తనాలు తెల్ల సంచుల్లో విక్రయించే అవకాశం ఉంది. అలా విక్రయించే వారి సమాచారాన్ని తక్షణమే వ్యవసాయ శాఖాధికారులకు తెలియజేయాలి. ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు తీసుకోవాలి. విత్తనాలతో పాటు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయ పంటలు సాగు చేసే రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారులు విత్తనాలు విక్రయించే డీలర్లకు, వ్యవసాధికారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో దుకాణాలు యజమానులు విచ్చలవిడిగా విత్తనాలను విక్రయిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వానికి రైతుల విన్నపం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు మండలంలోని నాయుడువలస గ్రామానికి చెందిన రైతులు. వీరు ఏమంటున్నారంటే.. గత ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500లు మూడు దఫాలుగా అందించేది. దీని వలన ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి వెసులుబాటు ఉండేది. తొలి విడతగా మే నెలలోనే రూ.7,500లు రైతు ఖాతాల్లో జమ చేసేది. దీని వలన చిన్న సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలా వరకు కలిసి వచ్చేది. మే నెలతో పాటు అక్టోబరు, జనవరి నెలల్లో నిధులు రైతుల ఖాతాల్లో పడేవి. వైఎస్సార్ రైతుభరోసా తొలి విడతగా రూ.5500లు, రెండవ విడత అక్టోబరు నెలలో రూ.2 వేలు చొప్పున్న అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలను మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున్న ఇచ్చేవారు. ఈ ఏడాది మే నెల దాటుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకు జీవో అతిగతీ లేదు. రాష్ట్ర ప్రభుత్వం తమకు పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో ముందుగా ఆర్‌ఎస్‌కేలలో లభించని విత్తనాలను ప్రభుత్వం గుర్తింపు పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. కొద్దిపాటి విత్తనాలను మొలకెత్తించాలి. 80 శాతం పైగా విత్తనాల మొలకల్లో తేడా వస్తే తక్షణమే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రతీ రైతు తాను కొనుగోలు చేసిన విత్తనాల షాపు యజమాని నుంచి రశీదు తీసుకోవాలి. కల్తీ విత్తనాలతో మోసపోతే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. నష్టపోయిన రైతులు పరిహారం అందుకోవడానికి ఆధారాలు తప్పనిసరిగా ఉండాలి. వరి విత్తనాలు తెచ్చిన సంచులు జాగ్రత్తగా వుంచాలి. పంట చేతికి వచ్చే వరకు రైతులు విత్తనాలకు సంబంధించిన అన్నీ ఆధారాలు భద్రంగా ఉంచడం రైతులకు మేలు.

– వీటీ రామారావు, వ్యవసాయ శాఖ జేడీ, విజయనగరం

లింగ నిర్ధారణ వెల్లడిస్తే క్రిమినల్ చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారులు స్కానింగ్ సెంటర్లను విధిగా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని ఫెర్టిలిటి కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ, ఘోషాస్పత్రి గైనికాలజిస్టు డాక్టర్ జె.సుధ, పిల్లల వైద్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డీపీఆర్‌వో జానకమ్మ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డెమో వి.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో చోరీలకు అడ్డుకట్ట

- ఎస్పీ మాధవ్‌రెడ్డి





జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పార్వతీపురం రూరల్: ప్రజలు తీర్థ యాత్రలు, వేసవి విహార యాత్రలకు వెళ్లే సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పలు బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు, ప్రయాణికులకు పోలీసు శాఖ ద్వారా శనివారం అవగాహన కల్పించారు. ఇళ్లల్లో వృద్ధులు, చిన్నారులను విడిచిపెట్టి బయటకు వెళ్లడం వల్ల మాటు వేసిన దొంగలు గమనించి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. దీన్ని గుర్తించి ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. చోరీల నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళం వేసి సొంత గ్రామాలకు లేదా వ్యక్తిగత అవసరాల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచి వెళ్లకూడదు. పరిసరాల్లో, వీధుల్లో కచ్చితంగా నిఘా కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లల్లో వృద్ధులను, చిన్న పిల్లలను విడిచిపెట్టి వెళ్లకూడదు. అత్యవసరమైతే ఇరుగు, పొరుగు వారిని గమనిస్తూ ఉండమని చెప్పాలి. బహుళ అంతస్తుల భవన సముదాయాల్లో సీసీ కెమేరాలతో పాటు 24/7 సెక్యూరిటీ గార్డులతో రాత్రి వేళల్లో రెస్కీని ఏర్పాటు చేసుకోవాలి. ఉక్కబోత దృష్టిలో ఇంటి బయట, మిద్దెలపై పడుకొనేటప్పుడు ఇంట్లో వున్న విలువైన వస్తువులపై తగు భద్రత చర్యలు తీసుకోవాలి. ఇళ్లకు నాసిరకం తాళాలు వాడకుండా, తాళం వేసినట్లు కనబడకుండా కర్టెన్స్ ద్వారా జాగ్రత్తలు తీసుకొని ఇళ్లకు సంబంధించిన ప్రధాన గేట్లుకు లోపల భాగం ద్వారా లాక్ చేసుకొని వెళ్లాలి. అశ్రద్ధతో ఊళ్లకు వెళ్లే సమయంలో తాళాలను పూల కుండీల్లో, మ్యాట్స్ కింద, చెప్పుల స్టాండ్‌ల్లో పెట్టకూడదు. వాహనాలు పార్క్ చేసేటప్పుడు వీలైనంత మేరకు నిఘా ఉన్నచోట పార్క్ చేసేందుకు ఏర్పాటు చేసుకొని కచ్చితంగా హ్యాండిల్ లాక్ చేసి వెళ్లాలి. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నట్టు గుర్తిస్తే తక్షణమే సమీపంలో వున్న పోలీసుస్టేషన్‌కు లేదా డయల్ 100/112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. కచ్చితంగా జాగ్రత్తలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ సీఐ అప్పారావు, క్రైమ్ ఎస్‌ఐ సూర్యారావు తదితర సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్, పలు బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో మెయిన్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచరాం గ్రామానికి చెందిన కంచెర్ల అప్పలరాజు అనే వృద్ధుడు గాయాలు పాలయ్యాడు. ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు.. అప్పలరాజు కిరాణా సరుకులతో మెయిన్ రోడ్డుపై ప్రభుత్వ పాఠశాల ఎదురుగా బస్సు ఎక్కుతున్నాడు. అదే సమయంలో డ్రైవర్ బస్సును ముందుకు నడపడంతో రోడ్డుపై పడిపోయాడు. దీంతో గాయాల పాలైన అప్పలరాజును కండక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేశారని తెలిపారు. బాధితుడి తమ్ముడి కుమారుడు కంచెర్ల ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన నడుపుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ మాజీ ముఖ్యమంత్రిపై ఉన్న అక్కసుతోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసి ప్రజలను, నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రేగిడి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఇంటి వద్దే అందించిన రేషన్ బళ్లను రద్దు చేసి మళ్లీ రేషన్ దుకాణాల వద్దకే సరుకులు తీసుకునేందుకు ప్రజలను పంపించేందుకు నిర్ణయం తీసుకోవడం హేయమైన చర్యన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు దూరం చేయడానికే ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయమని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేషన్ సరఫరా కోసం ఎండీయూ వాహనాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి నేరుగా సరుకులు సరఫరా చేసేవారన్నారు. ఇప్పుడు ఆ వాహనాలు రద్దు చేయడం వలన ప్రజలు ప్రభుత్వ సేవలకు దూరం అవుతారని పేర్కొన్నారు. జిల్లాలో 370 వాహనాలు రద్దు చేయడం వలన వాహన నిర్వాహకుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ భృతి హామీ అమలు చేయక పోగా రాష్ట్రంలో ఈ వాహనాల రద్దుతో మరికొంత మందిని నిరుద్యోగులను చేసిందన్నారు. జిల్లాలో 1249 రేషన్ డిపోల్లో మళ్లీ పాత పద్ధతినే కొనసాగిస్తుండడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు తప్పవని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి వచ్చి సరుకులు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాలంటీర్ వ్యవస్థ రద్దు చేయడంతో ఇటువంటి వారికి సరుకులను ఎలా అందజేస్తారని అన్నారు. ఎండీయూ వాహనాల రద్దుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

- చాకచక్యంగా పట్టుకున్న రైల్వే, ఫైర్ సిబ్బంది



రైల్వేస్టేషన్‌లో రేకుల షెడ్ పై నుంచి యువకుడిని తాళ్లతో బంధించి దించుతున్న రైల్వే, ఫైర్ సిబ్బంది

కొత్తవలస : మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి కొత్తవలస రైల్వేస్టేషన్‌లో శనివారం విద్యుత్ వైర్లు పట్టుకొని చనిపోతానని హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటలు శ్రమించి రైల్వే సిబ్బంది, ఫైర్ పోలీస్‌లు ఆయనను చాకచక్యంగా పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మతి స్థిమితం లేని ఒక యువకుడు స్థానికులపై రాళ్లు రువ్వి బెదిరించాడు. సమీపంలో గల రైల్వేస్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ లైన్‌ల సమీపంలో గల రేకుల షెడ్‌పైకి ఎక్కి వైర్లు దగ్గరకు వెళ్లాడు. ప్రమాదం దిగిపో.. అంటూ స్థానికులు, రైల్వే సిబ్బంది సూచించినా కనీసం పట్టించుకోలేదు. ఎవరైనా దగ్గరకు వస్తే వైర్లు పట్టుకొని చనిపోతానని బెదిరించాడు. రైల్వే అధికారులు అప్రమత్తమై విశాఖపట్నం ప్రధాన రైల్వేస్టేషన్‌కు ఫోన్ చేసి ప్రధాన లైన్‌కు సంబంధించి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. ఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకొని రైల్వే సిబ్బందితో కలిసి ఆ యువకుడిని తాళ్లతో బంధించి కిందకు దించారు. అనంతరం విశాఖపట్నం తరలించారు.


బృహత్తర ప్రణాళికపై అభ్యంతరాల స్వీకరణ



ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన బృహత్తర ప్రణాళికా చిత్రం

విజయనగరం: విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ గతంలో రూపొందించిన బృహత్తర ప్రణాళికపై ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలు కోరుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం తెలిపారు. 2021లోనే బృహత్తర ప్రణాళికను ఆమోదించడం జరిగిందని, ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పరిధిలోని పట్టణాలు, గ్రామాలకు రూపొందించిన బృహత్తర ప్రణాళిక-2041 ఆమోదం కోసం ప్రచారం చేయడం జరుగుతోందన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అందించిన వివరాల ప్రకారం 2041 బృహత్తర ప్రణాళికపై పునఃపరిశీలనకు సదరు ప్లాన్ పై అభ్యంతరాలు ఉంటే నిస్సందేహంగా తెలపవచ్చన్నారు. మే 22 నుంచి అభ్యంతరాల స్వీకరణ ప్రారంభమైందని, జూన్ 21 వ తేదీ వరకు ప్రజలు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా గానీ పోస్టు ద్వారా తెలియజేయవచ్చన్నారు.

వడదెబ్బకు రైతు మృతి



శ్రీరాములదొర(ఫైల్)

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన శ్రీరాములదొర(74) అనే రైతు వడదెబ్బకు శనివారం గుర్రై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం వీరఘట్టం మార్కెట్‌కు సామగ్రి తేవడానికి వెళ్లి మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీరాములదొర ఇంటికి వచ్చాడు. ఇంట్లో మంచంపై కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

జనావాసాల నడుమ కూలిన విద్యుత్ స్తంభాలు



సంఘటనకు కారణమైన ట్రాక్టర్, రోడ్డుకు అడ్డంగా పడిన విరిగిన విద్యుత్ స్తంభం



ప్రమాద తాకిడికి విరిగిన మరో స్తంభం

సంతకవిటి మండలంలోని కృష్ణంవలస గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇటుకలతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి దిగువ వీధిలోని మట్ట దుర్గారావు ఇంటి సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ తాకిడికి అదే వీధిలోని మరో రెండు విద్యుత్ స్తంభాలు ఉన్న ఫలంగా విరిగి కింది పడ్డాయి. వీటితో పాటు మరో స్తంభం వాలిపోయింది. విద్యుత్ వైర్లు ఇళ్లను తాకుతూ వీధుల్లో చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరాను నిలిపి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ పరిణామంతో వీధుల్లోని ప్రజలు ప్రాణ భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు గ్రామాన్ని సందర్శించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

– సంతకవిటి

27న ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఐటీఐ చదువుతున్న ఈ విద్యా సంవత్సర విద్యార్థుల కోసం ఈ నెల 27న క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ 2025ను స్థానిక వీటీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తామని ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ టీవీ గిరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 9 కంపెనీలు పాల్గొనే ఈ డ్రైవ్‌కు ఐటీఐ పాసైన, ఆగస్టు 2025 పరీక్షలకు హాజరు కాబోయే చివరి సంవత్సరం అభ్యర్థులు ఈ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9849118075, 9849944654 ఫోన్‌లకు సంప్రదించాలని సూచించారు.